


PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక: 44 ఎడిటర్: రాపోలు లింగస్వామి 14 -10 -2026 బుదవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

### ప్రధాని మోదీకి జ్ఞానేశ్‌కుమార్

## ఎందుకంత ముఖ్యమో..

: అభిజిత్ దీప్కే



దేశంలో నియంతృత్వ ధోరణి నడుస్తున్నదని 'కాక్రోచ్ జనతా పార్టీ ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మండి పడ్డారు. పాలకులు నిబంధనలను విస్మరి స్తున్నారని విమర్శించారు. తప్పు చేయకుండా వాళ్లు దేనికి భయపడుతున్నారని ప్రశ్నించారు. తమ పార్టీ ముఖ్య నాయకు లను అదుపులోకి తీసుకున్నారని, వాళ్లను వేర్వేరు చోట్ల నిర్బంధిం చారని చెప్పారు. తాను ఇప్పుడే అఫ్ఖ లీగల్ హెడ్ రత్నాసింగ్‌తో మాట్లాడానని చెప్పారు. ఢిల్లీలో అరెస్ట్ చేసిన తర్వాత తమ పార్టీ ముఖ్యులు అశుతోష్, అజింక్య, సౌరవ్‌లను వేర్వేరుగా ఉంచారని ఆమె తనకు చెప్పినట్లు తెలిపారు. వారితోపాటు ఉన్న 11 మంది వాలంటీర్లను వేరే ప్రాంతానికి తరలించారని అన్నారు. తమ న్యాయవాదులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినప్పుడు పోలీసులు వారిని లోపలికి అనుమతించలేదని చెప్పారు. తమ పార్టీకి చెందిన ఇతర వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకుంటామని పోలీసులు బెదిరించారని అన్నారు.

### సామాజిక న్యాయానికి

# కాంగ్రెస్ పుట్టినిల్లు

**రెండు సీట్లనూ రెడ్లకే ఇచ్చామనుకోవద్దు**
**మిగిలినవి ఇతర సామాజిక వర్గాలకు**
**ప్రజాప్రతినిధులు, డీసీసీ చీఫ్‌లతో భేటీలో సీఎం రేవంత్**



న్యూఢిల్లీ, అక్టోబరు 13: తెలంగాణలో త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలనూ కాంగ్రెస్ పార్టీయే గెలుచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయాల్లో గెలుపే ప్రామాణికమని, ఇక్కడ సెకండ్ ప్రైజ్ ఉండదని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో నేతల పనితీరుపై ఆధారపడే భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని, నిర్లక్ష్యం వహిస్తే రాజకీయ జీవితం ముగిసినట్లేనని హెచ్చరించారు. ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని తన అధికారిక నివాసంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులతో రేవంత్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దాదాపు గంటకుపైగా సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. నాయకులు భేషజాలకు పోకుండా కలిసికట్టుగా పనిచేయాలని, ఎన్నికలను ఎట్టిపరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోవద్దని హెచ్చరించారు. ఈ ఎన్నికలు దాదాపు 75 శాతం తెలంగాణను కవర్ చేసే అత్యంత కీలకమైన పోరు అని పేర్కొన్నారు. ఎన్నికల బాధ్యతలను జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు సమన్వయంతో భుజానికెత్తుకోవాలన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను ఒకే సామాజిక వర్గానికి కేటాయించారంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సూచించారు.సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పుట్టినిల్లు అని చెప్పారు. గతంలో నామినేటెడ్ పదవులు, ఎమ్మెల్సీ స్థానాలు, పార్టీ పదవులు,కార్పొరేషన్ చైర్మన్ల భర్తీలో **2వ పేజీలో ..**

## సర్, ఎలక్షన్ కమిషన్

## పై పోరాటం..

**రాహుల్ ఇంట్లో ఇండియా కూటమి, విద్యార్థి సంఘాల భేటీ**



సర్, ఎలక్షన్ కమిషన్ పై పోరాటం.. రాహుల్ ఇంట్లో ఇండియా కూటమి, విద్యార్థి సంఘాల రాహుల్ గాంధీ.. ఇండియా కూటమి నాయకులు, ప్రతిపక్ష ఎంపీలు, విద్యార్థి సంఘాలు, పౌర సమాజ ప్రతినిధులను తన నివాసానికి తేనీటి విందు కోసం ఆహ్వానించారు. దీంతో ఆయన నివాసంలో సమావేశం జరుగుతోంది. ఈసందర్భంగా ఆరోపిత "ఓట్ల చోరీ"కి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టడం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞనేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేయడంపై ఉమ్మడి వ్యూహాన్ని ప్రతిపక్ష నాయకులు చర్చించే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం మీడియా సమావేశం ఉంటుందని రాహుల్ తెలిపారు.

### సింగరేణి ఉద్యోగుల సొంతింటి కలను నెరవేర్చేందుకు

# ప్రభుత్వం చర్యలు



హైదరాబాద్: సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారంపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క తెలిపారు. కార్మికుల సమస్యలపై చర్చించి పలు అంశాలపై నిర్ణయాలకు వచ్చామని అన్నారు. ఈ 300 మంది డిపెండెంట్ కార్మికులకు సంబంధించిన ఉద్యోగ నియామక ఉత్తర్వులను 15 రోజుల్లో జారీ చేయాలని నిర్ణయించామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సింగరేణిలో 38 వేల మంది శాశ్వత కార్మికులు, మరో 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, మారుపేర్ల సమస్యకు సంబంధించి 15 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్‌కు సంబంధించి ఆసుపత్రిలోనే బోర్డు వైద్యులు పరీక్షలు నిర్వహించామని, విధులకు హాజరుకాని ఉద్యోగులను డిస్మిస్ చేసిన నేపథ్యంలో, కరోనా సమయంలో విధులకు హాజరుకాని ఉద్యోగులకు వన్‌టైమ్ ఆప్షన్ కల్పించాలని నిర్ణయించామని అన్నారు. సింగరేణి ఉద్యోగుల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, అర్హులైన ఉద్యోగులకు సింగరేణి ఇళ్ల స్థలాలు కేటాయించాలని నిర్ణయించామని చెప్పారు. మైనింగ్ కార్యకలాపాలు లేని ప్రాంతాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేసి, ఇళ్లను నిర్మించి అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి సంస్థకు రూ.1,754 కోట్ల మేర లాభాలు వచ్చాయని, గతేడాది మాదిరిగానే ఈసారి కూడా కార్మికులకు 34 శాతం లాభాల వాటా అందించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంతో ఒక్కో సింగరేణి ఉద్యోగికి రూ.1,53,912 చొప్పున లాభాల వాటా అందనుంది. అలాగే, ఒప్పంద కార్మికులకు రూ.5,500 చొప్పున చెల్లించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించి కూడా నిర్ణయం భట్టి విక్రమార్క తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# 20 ఏళ్ల పోరాటానికి ఫలితం..

### ఉపాధి హామీ ఎఫ్‌టీఈ ఉద్యోగులకు దసరా కానుక..



హైదరాబాద్, అక్టోబర్ 13: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఎఫ్‌టీఈ ఉద్యోగులకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం దసరా కానుక అందించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ సమస్యకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు 3,800 మంది ఉద్యోగులకు గ్రాట్యుటీ ప్రయోజనం కల్పిస్తూ జీవో జారీ చేసింది. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో దాదాపు 20 ఏళ్లుగా ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సర్వీసు, రిటైర్మెంట్‌కు సంబంధించిన నిబంధనల ప్రకారం కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీతో పాటు, పదేళ్ల సర్వీసు పూర్తిచేసే ఉద్యోగులకు రూ.10 లక్షల వరకు ప్రయోజనం లభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో ఆర్థిక భరోసా లభించనుంది. తమ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన మంత్రి సీతక్కకు ఎఫ్‌టీఈ ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. అలాగే గ్రాట్యుటీ మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ డిమాండ్ నెరవేరడం పట్ల ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలకు దశలవారీగా పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. దీర్ఘకాలం సేవలందించిన ఉద్యోగులకు జీవిత చరమాంకంలో ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో గ్రాట్యుటీ మంజూరు నిర్ణయం ఎఫ్‌టీఈ ఉద్యోగులకు ఎంతో ఊరటనివ్వనుంది. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తమ 20 ఏళ్ల పోరాటానికి గుర్తింపుగా నిలుస్తుందని ఉద్యోగ సంఘం ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. తమ న్యాయమైన డిమాండ్‌ను గుర్తించి అమలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

### లక్ష్మీ భావన దయా బెస్ట్ షుగర్ ఫ్రీ రైస్ స్టోర్ ప్రారంభం



సూర్యాపేట: ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని పూల సెంటర్ సమీపంలోని యువరాజ్ జెంట్స్ షో రూమ్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ భావన దయా బెస్ట్ షుగర్ ఫ్రీ రైస్ స్టోర్ ను వారు ప్రారంభించి మాట్లాడారు.షుగర్ ఉన్నవారు తినడానికి అనుకూలమైన షుగర్ ఫ్రీ రైస్ ను అందుబాటులో తీసుకురావడం అభినందనీయమని అన్నారు.అనంతరం ప్రొప్రైటర్ రాచర్ల చిరంజీవి మాట్లాడుతూ షుగర్ ఫ్రీ రైస్ మధుమేహం ఉన్నవారికి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించేందుకు సహాయపడుతుందని అన్నారు.గుండె ఆరోగ్యానికి, శరీరానికి కావాల్సిన శక్తిని స్థిరంగా అందిస్తుందని తెలిపారు. ఈ బియ్యాన్ని వినియోగించడం వల్ల బరువు నియంత్రణతో పాటు పోషకాలు లభిస్తాయని అన్నారు.సూర్యాపేట పట్టణ,పరిసర ప్రాంత ప్రజలు తమ సేవలను వినియోగించుకుని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీవుల్లా, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ వెలుగు వెంకన్న, రాచర్ల కమలాకర్, నాయకులు పోలగాని కృష్ణ, తండు శ్రీనివాస్, బిక్కుమల్ల కృష్ణ,రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు, యాదగిరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుల పరిరక్షణపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో ఎంపీ వంశీకృష్ణ, మంత్రి వివేక్ భేటీ




న్యూఢిల్లీ: ఢిల్లీలోని సునేరి బాగ్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, తెలంగాణ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కలిశారు.దేశవ్యాప్తంగా ాఎఖ్ ప్రక్రియ, ఓటర్ల జాబితాల సవరణ, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షణ అంశాలపై చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

# సంపాదకీయం

## బకాయిల కోసం..

## చలో సెక్రటేరియట్

రాష్ట్రవ్యాప్తంగా గల రిటైరైన దాదాపు 26 వేల మంది ప్రభుత్వ పెన్షనర్లు తమకు 2024 మార్చి నుంచి ఇప్పటివరకు రావాల్సిన బకాయిల కోసం నేడు చలో సెక్రటేరియట్ నిర్వహించనున్నారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ నిర్ణయం మేరకు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో సన్నాహక కార్యక్రమాలు చేపట్టింది.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 105 మంది పెన్షనర్లు అనారోగ్యంతో, క్యాన్సర్ వంటి వివిధ రకాల జబ్బులతో బాధపడుతూ చనిపోయారు. రిటైరై రెండున్నరేండ్లయినా ప్రభుత్వం ఏ ఒక్కరికీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో బకాయిలను చెల్లించలేదు.

ప్రజా పాలన, ఇందిరమ్మ రాజ్యం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలనలో దుర్భర స్థితిలో పెన్షనర్లు కాలం గడుపుతున్నారు.

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు, పెన్షనర్ల నాలుగు ప్రధాన సమస్యలు, న్యాయంగా రావలసిన వాటిని కూడా అమలు చేయకుండా దాదాపు మూడేండ్లు అవుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను సర్కార్ వేధిస్తున్నది. రిటైర్మెంట్ బకాయిలు చెల్లించాలని బాధిత పెన్షనర్లు ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకుని వివిధ రకాల పోరాటాలు చేస్తున్న క్రమంలో వారికి మద్దతుగా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్జీపీఏటీ), పెన్షనర్ల జేఏసీ సంయుక్తంగా హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద, జిల్లా కేంద్రాల్లో గత ఏడాది నుంచి నాలుగుసార్లు మహాధర్నాలు చేపట్టాయి. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదు. బాధిత సంఘాలు కూడా వివిధ జిల్లాలతోపాటు చలో అసెంబ్లీ, చలో రాజ్‌భవన్ కార్యక్రమాలు చేపట్టాయి. ఏప్రిల్, మే నెలల్లో 207 సంఘాలతో ఉన్న టీజీఈజేఏసీ ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది.

ఆ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు దాదాపు రూ.14 వేల కోట్లు పెండింగ్‌లో ఉంటే 100 రోజుల్లో ఆరు వేల కోట్లు చెల్లిస్తామని ఈ ఏడాది మే రెండున ఉద్యోగ జేఏసీకి సర్కార్ హామీ ఇచ్చింది. ఈ మేరకు మే నుంచి జూలై వరకు ప్రతినెలా రూ.2 వేల కోట్ల చొప్పున రూ.6 వేల కోట్లు చెల్లించామని ప్రభుత్వమే స్వయంగా వెల్లడించింది. 100% జీపీఎఫ్, 100% కమ్యూటేషన్ చెల్లించామని సర్కార్ వివిధ ప్రధాన పత్రికలు, టీవీ చానళ్లలో ప్రకటించుకున్నది. కానీ ఎంతోమందికి ఇంకా జీపీఎఫ్, కమ్యూటేషన్ కూడా రాలేదు. 2024లో రిటైరైన వారికి లీవ్ ఎన్ క్యాష్మెంట్, గ్రాట్యుటీ, జీఐఎస్ విడుదల కాలేదు. 2025లో రిటైరైన వారికి పీఆర్సీ ఎరియర్స్ కూడా చెల్లించలేదు.

ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ఏమాత్రం దయ, కనికరం, మానవత్వం చూపించకుండా, అమానవీయంగా ప్రవర్తిస్తున్నది. ఉద్యోగులు పొదుపు చేసుకున్న జీపీఎఫ్, జీఐఎస్, టీజీఎల్ఐ నిధులను కూడా ఇతర పథకాలకు పక్కదారి పట్టించింది. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవంటూనే ఏ పథకాలనైనా నిధులు ఆపారా? అని రిటైర్డ్ ఉద్యోగులు నిలదీస్తున్నారు. రిటైరైన తర్వాత తర్వాత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లించాల్సి ఉన్నా ప్రభుత్వం ముందుకు రావడం లేదు. దాదాపు మూడేండ్లుగా బకాయిలు అందక ఇబ్బందులు పడుతున్న రిటైర్డ్ ఉద్యోగులకు వడ్డీతో సహా ఏకమొత్తంగా చెల్లించాలని, కోర్టు ఆదేశాల మేరకు బకాయిలు సాధించుకున్న వారికి కూడా వడ్డీ చెల్లించాలి.

పీఆర్సీ రిపోర్టును సంబంధిత కమిటీ చైర్మన్ ప్రభుత్వానికి వెంటనే సబ్మిట్ చేసి 51% ఫిట్మెంట్‌తో ఆమోదించడం, రెండు డీఏల ప్రకటన, నగదు రహిత వైద్యం పూర్తిస్థాయిలో సక్రమంగా అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యేవిధంగా చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే కార్యక్రమాలను చేపట్టడానికి పెన్షనర్లు అందరూ సంసిద్ధంగా ఉండాలి. సంఘాలకు అతీతంగా వేలాదిగా పెన్షనర్లు పాల్గొని హక్కుల సాధన కోసం ఐకమత్యంగా ప్రభుత్వాన్ని నిలదీద్దాం.

## కనిగిరి మున్సిపాలిటీలో ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్‌కు దళిత హక్కుల పోరాట సమితి వినతి**



మార్కాపురం జిల్లా, కనిగిరి, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 13: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో రాజ్యాంగబద్ధమైన హక్కులకు భంగం కలగకుండా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి మార్కాపురం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కనిగిరి మున్సిపాలిటీలో ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పందిటి మోహన్ మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులు ఉన్నాయని, వార్డుల రిజర్వేషన్లకు సంబంధించి సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వివరాల ప్రకారం ఎస్టీలకు రెండు, ఎస్సీలకు నాలుగు, బీసీలకు పది, ఓసీలకు 16 వార్డులు కేటాయించినట్లు తెలుస్తోందన్నారు. ఈ విధంగా రిజర్వేషన్లు ఖరారు చేస్తే ఎస్సీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లభించకపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే తమ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని, రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కనిగిరి మున్సిపాలిటీలో ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్ల ప్రకారం ఐదు వార్డులు కేటాయించే అంశాన్ని పరిశీలించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.

**మొదటి పేజీ తరువాయి ..**

### సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పుట్టినిల్లు

ఎంత పారదర్శకంగా వ్యవహరించామో, సామాజిక సమతుల్యతను ఏ విధంగా పాటించామో ప్రజలందరికీ తెలుసునని పేర్కొన్నారు. రాబోయే ఎమ్మెల్సీ స్థానాలను మిగిలిన సామాజిక వర్గాలకు కేటాయించి ఈ లోటును భర్తీచేస్తామన్నారు. కాకతీయ వర్సిటీ విద్యార్థి నేతకు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తామని ప్రకటించారు.

దసరాలోపు కమిటీలు వేయాలి..

ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, దసరా పండుగలోపు గ్రౌండ్‌వర్క్ అంతా పూర్తిచేసి కమిటీలను నియమించాలని పార్టీ నేతలను సీఎం రేవంత్ ఆదేశించారు. మండల స్థాయిలో సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలు వేయాలని, జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులతో కూడిన కమిటీ జిల్లా స్థాయి బాధ్యతలను పర్యవేక్షించాలని సూచించారు. కమిటీల్లో నియమించే ప్రతి సభ్యుడికీ తప్పనిసరిగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కు ఉండాలని స్పష్టం చేశారు. ఈ నెల 21, 23 తేదీల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాలపై తాను సమీక్ష సమావేశాలు నిర్వహిస్తానని చెప్పారు. పీఆర్సీ ఏర్పాటు సహా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులను భాగస్వాములను చేస్తూ ప్రచారాన్ని ముందుకు నడిపించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 75 శాతం, మున్సిపాలిటీల్లో 80 శాతానికి పైగా స్థానాలు సాధించిన ఉత్సాహంతో ఈ రెండు ఎమ్మెల్సీల్లోనూ జయకేతనం ఎగరవేయాలని పిలుపునిచ్చారు.

నేతలంతా తిరుగు ప్రయాణం

ఇండియా కూటమి ఆందోళనలో పాల్గొన్న తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులను సీఎం రేవంత్ ప్రత్యేకంగా అభినందించారు. కొందరు నేతలు ఖర్గేను కలిశారు. నేతలు తమ తమ రాష్ట్రాలకు వెళ్లవలసిందిగా ఏఐసీసీ సూచించడంతో నేతలంతా రాష్ట్రానికి తిరుగు ప్రయాణమయ్యారు. సీఎం రేవంత్ సైతం హైదరాబాద్‌కు చేరుకున్నారు.

## ఆలోచనే అసలైన ఆయుధం!



సంపాదించే సత్తా ఉన్నవాడు పోయిన సంపద కోసం కన్నీరు కార్చడు! మళ్లీ సృష్టించే తెలివి తనకుందని కాలానికే సవాలు విసిరి నిలబడతాడు!గెలిచే గుండెధైర్యం ఉన్నవాడు ఓటమి దెబ్బకు మోకరిల్లడు! పరాజయాన్ని పాతిపెట్టి మరీ విజయానికి పునాదులు వేస్తాడు!బలహీనుడు పరిస్థితులను నిందిస్తాడు, బలవంతుడు పరిస్థితులనే మార్చేస్తాడు! ఒకడు గాయాలకు బానిసవుతాడు, మరొకడు ఆ గాయాలనే ఆయుధాలుగా మలుస్తాడు!గుర్తుపెట్టుకో మిత్రమా! బలం కండరాల్లో లేదు, సంపదలో లేదు, నీ ఆలోచనల పదునులోనే నీ పతనం నీ ఆలోచనల పౌరుషంలోనే నీ విజయం!రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

## లక్ష్యం ఉండాలి

లక్ష్యం లేని జీవితం దిక్సూచి లేని పడవ, దిశ తెలియని ప్రయాణం



గమ్యం చేరని పరుగు!

కలలు కనడం మాత్రమే విజయానికి పునాది కాదు, ఆ కలలను నిజం చేసే కార్యదీక్ష కూడా ఉండాలి!

మన అడుగులకు ఒక నిర్దిష్టమైన దిశ ఉండాలి, మన ఆలోచనలకు ఆశయాల అండ ఉండాలి!

ఎదురయ్యే ఆటంకాలు ఎన్నున్నా వెనకడుగు వేయకు, ఎదుట నిలిచే ఓటములకు ఎన్నడూ తలవంచకు!

లక్ష్యం స్పష్టంగా ఉంటే మార్గం కనిపిస్తుంది, పట్టుదల దృఢంగా ఉంటే విజయం దాసోహమవుతుంది!

కాలం కఠిన పరీక్షలు పెట్టినా కలవరపడకు, కష్టాలు కత్తులై గుచ్చినా కుంగిపోకు!

విమర్శించే గొంతులు నీ చుట్టూ ఎన్ని ఉన్నా, నీ గమ్యాన్ని చేరేవరకు నీ ప్రయాణం ఆపకు!

అవకాశాల కోసం ఎదురుచూస్తూ కాలాన్ని వృథా చేయకు, నీ కృషితోనే కొత్త అవకాశాలకు ప్రాణం పోయి!

ప్రతి ఓటమిని ఓ పాఠంగా మలచుకో, ప్రతి అడ్డంకిని అధిగమించే ఆయుధంగా మార్చుకో!

నీ శ్రమకు చెమట చుక్కలే సాక్ష్యాలవ్వాలి, నీ విజయానికి నీ పట్టుదలే పతాకమవ్వాలి!

గమ్యం ఎంత దూరమైనా అడుగులు ఆపకూడదు, ప్రయాణం ఎంత కఠినమైనా ఆశలు వదలకూడదు!

లక్ష్యం స్పష్టంగా ఉండాలి, సంకల్పం శిలలా నిలవాలి, పట్టుదల పిడుగులా మారాలి, విజయం నీ సొంతం కావాలి!

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

## మియాపూర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న డా. యలమంచి ఉదయ్ కిరణ్**

**కాలనీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు**



మియాపూర్, జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి, అక్టోబర్ 13: మియాపూర్ ఎఫ్‌సీఐ కాలనీ పార్క్‌లో ఎఫ్‌సీఐ కాలనీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రి?దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు డా. యలమంచి ఉదయ్ కిరణ్ ఈ కార్యక్రమానికి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శాంతితో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఎఫ్‌సీఐ కాలనీ ఉత్సవ కమిటీ సభ్యులు చంద్ర మౌళి, ఆనంద్, మహేందర్ తదితరులు డా. యలమంచి ఉదయ్ కిరణ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయుడు, నాగిరెడ్డి, గంగాధర్, సంజయ్, శరత్, కామినేని వాసు, వంశీ, నాని, అశోక్, ప్రవీణ్, రాజశేఖర్, రత్నాచారి, వినోద్, శశి తదితరులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

**: దద్దాల**

**విభేదాలను పక్కనపెట్టి సమష్టిగా పనిచేయాలి**

**కనిగిరిలో 32 వార్డుల నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల సన్నాహక సమావేశం**

కనిగిరి, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 13:రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా పనిచేయాలని కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. కనిగిరిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలతో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ వ్యక్తిగత అభిప్రాయాలు, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రతి వార్డులో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. కనిగిరి మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆయన, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు ఇతర సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. అలాగే, కార్యకర్తలు అక్రమ కేసులు, బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి వార్డులో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉంటూ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఢిల్లీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై లాఠీచార్జ్‌ను ఖండించిన పన్యాల జైపాల్ రెడ్డి





ఎల్బీనగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,అక్టోబరు 13: ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి గాయాలవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలపై పోలీసుల బలప్రయోగం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా నిరసన తెలిపే హక్కును గౌరవించాలని ఆయన సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పన్యాల జైపాల్ రెడ్డి కోరారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ దోహదం

### కుర్మగూడలో శిక్షణ కేంద్రం ప్రారంభం



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం ప్రతినిధి, అక్టోబర్ 13 మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఎంతగానో దోహదపడతాయని ఐఎస్ సదన్ మాజీ కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. కుర్మగూడలోని యాదవ సంఘం భవనంలో అటల్ బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ చైర్మన్ గంగపురం కావ్య రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కావ్య రెడ్డిని శ్వేతా మధుకర్ రెడ్డి ఘనంగా సన్మానించి, మహిళలకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ముందుకు వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సహకారంతో ఫౌండేషన్ ద్వారా మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్ తదితర కోర్సుల్లో శిక్షణ అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, స్వయంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకుంటూ ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడాలని ఆకాంక్షించారు. మహిళల సాధికారతకు ఇలాంటి శిక్షణ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమానికి భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో భాగ్యనగర్ మహిళా మోర్చా నాయకులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# గుండా మల్లేష్ స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగిస్తాం

### ఎల్ ని నో ప్రభావం తో ఉపాధి పథకాన్ని 200 రోజులకు పెంచాలి

సూర్యాపేట, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 13:బి కే ఎం యు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ సిపిఐ శాసనసభ పక్ష నాయకుడు గుండా మల్లేష్ ఉద్యమస్ఫూర్తితో వ్యవసాయ కార్మిక సంఘ ఉద్యమాలు కొనసాగిస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో బి కే యంయు జాతీయ నేత గూండా మల్లేష్ ఆరవ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా హాజరైన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం వల్ల కరువు విలయ తాండవం చేస్తుందని భవిష్యత్తులో అంటే మరికొద్ది నెలలో విపరీతమైన ఎండలతోపాటు తాగునీటి కూడా కష్టమయ్యే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయ శాఖ మంత్రులు ముందస్తు హెచ్చరికలు చేస్తున్నారని ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని గ్రామీణ ప్రాంతాల్లోనూ...అలాగే పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిస్తూ సంవత్సరానికి ?200 రోజులు పని కల్పించి రోజుకు 700 రూపాయలు వేతనం ఇస్తేనే ఆకలి చావులు లేకుండా ఉంటాయని లేకపోతే దేశవ్యాప్తంగా దిక్కుతోచని పరిస్థితి నెలకొని ఉన్నదని కేంద్ర ప్రభుత్వం సీ ఈ సీ జ్ఞానేశ్ కుమార్ ను కాపాడే పనిలో తల మునకలవుతున్నారని వారి బాధ వర్ణనాతీతమని అలాంటి పరిస్థితి పగవాడికి కూడా రాకూడదు అని ఒక్కడి పదవి కోసం యావత్తు ప్రభుత్వ యంత్రాంగం వణికి పోవడం చూస్తుంటే కేంద్ర ప్రభుత్వానికి ఇంతటి దుర్గతి ఎందుకు పట్టిందో ఆ పార్టీ పెద్దలు ఎన్డీఏ మిత్ర పక్షాలు ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆయన హితవుపలికారు కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి సిఐటియు మండల కార్యదర్శి నీలా రామ్మూర్తి బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ ఏఐటీయూసీ ప్రాంతీయ సహాయ కార్యదర్శి ముత్యాల భాస్కర్ సిపిఐ సీనియర్ నాయకులు బెల్లంకొండ గోవిందు గౌడ్ , బత్తిని శ్రీనివాస్ గౌడ్ బండి శ్రీనివాస్ ఎస్కే సయ్యద్ బాషా తదితరులు ఉన్నారు.



# ప్రతిభకు పట్టాభిషేకం-2026

### ఈ నెల 27న మెగా మ్యూజికల్ ఈవెంట్.. సాహితీ కళా సేవా ప్రతిభా పురస్కారాల ప్రదానం

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 13 (ప్రతినిధి):× వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ సమాజానికి సేవలందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి, ప్రోత్సహించేందుకు ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న హైదరాబాద్‌లో మెగా మ్యూజికల్ ఈవెంట్‌తో పాటు సాహితీ కళా సేవా ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నారు. 'ప్రతిభకు పట్టాభిషేకం.. అవార్డుల సంబరాలు' అనే నినాదంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులకు పురస్కారాలు అందజేయనున్నారు. విద్య, సాహిత్యం, కళలు, సంగీతం, జర్నలిజం, వైద్యం, సామాజిక సేవ, వ్యాపారం, సాంకేతిక రంగాలతో పాటు పలు విభాగాల్లో విశేష సేవలు అందించిన వారికి జ్ఞాపిక, మెడల్, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించనున్నారు. గోల్డెన్ నంది అవార్డులు, సింహ అవార్డులతో పాటు వివిధ రికార్డులు, అవార్డులు, రివార్డులను ప్రముఖుల చేతుల మీదుగా ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, కళాకారులు, జర్నలిస్టులు, దర్శకులు, నిర్మాతలు, గాయకులు, రచయితలు, నృత్యకారులు, యాంకర్లు, వైద్యులు, రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ఎన్జీవో ప్రతినిధులు, యూట్యూబర్లు, రైతులు, వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు, యోగా గురువులు, జానపద కళాకారులు, కోచింగ్ సంస్థల నిర్వాహకులు తదితరులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు తమ ఇంటిపేరు, పూర్తి పేరు, స్వస్థలం, అనుభవం, సాధించిన విజయాలు లేదా చేసిన సేవల వివరాలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోను వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 20 చివరి తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. హిమాయత్‌నగర్‌లోని శ్రీ వాసవి శ్రీముఖి కాంప్లెక్స్, వెస్ట్‌సైడ్ సమీపంలో, మినర్వా కాఫీ షాప్ పక్కన ఉన్న సరిగమ మ్యూజికల్ ఈవెంట్స్ గ్రాండ్ బాంక్వెట్ హాల్ అండ్ కరోకే స్టూడియోలో ఈ కార్యక్రమం జరగనుంది. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు 93966 10766 నంబర్‌కు వాట్సాప్ చేయాలని నిర్వాహకులు కోరారు. ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ తెలంగాణ అధ్యక్షుడు డా. ఆలూరి విల్సన్ (సెల్: 94948 61669) ఓ ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు.






# సింగరేణి ఉద్యోగులకు శుభవార్త

**- ఒక్కొక్కరికి రూ.1,53,912 లాభాల వాటా**

**- 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి**

**- 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్**

**- సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం**

**- పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం**

**- కార్మికుల సమస్యల పరిష్కారానికి మానవీయ దృక్పథం**

**- సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాకులు**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):సింగరేణి బొగ్గు గని కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ. 1,53,912 చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మంగళవారం ప్రకటించారు. ?మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఈ నిర్ణయంతో ప్రయోజనం పొందనున్నారని, 29717 మంది కాంట్రాక్టు కార్మికులకు




ఒక్కొక్కరికి రూ. 5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన 1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే 596 కోట్ల రూపాయలను లాభాల వాటాగా కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ. 5,500 బోనస్ అందించామని ఈ ఏడాది కూడా అదే మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించినట్లు వివరించారు. ??సింగరేణి ఉద్యోగ కార్మికులకు సొంతింటి కల సాకారం?సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తామని కార్మికుల సంక్షేమం వారి కుటుంబాల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని బట్టి విక్రమార్క వెల్లడించారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేస్తామని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలని తెలిపారు. మిశ్రమ ఆర్థిక విధానాలను ప్రోత్సహించి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన 5,774 ఎకరాల భూముల్లో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పట్టాల రూపంలో అందించారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించామని తెలిపారు. ??సింగరేణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 136 నుంచి గరిష్ఠంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఆయా ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి వీలైనంత ఎక్కువ మంది కార్మికులకు ప్రయోజనం కలిగేలా మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరుకాక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని మానవీయంగా వ్యవహరించాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశమని భట్టి విక్రమార్క వివరించారు.

# బీసీల సంక్షేమానికి రేవంత్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

### : దిడ్డి రాంబాబు

### బర్కత్‌పురలో నాయీ బ్రాహ్మణ సంఘ ఆత్మీయ కలయిక




భర్కత్ పుర, జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి హైదరాబాద్, అక్టోబర్ 13:రాష్ట్రంలో బీసీ కులాలు, ఉప కులాల సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు తెలిపారు. బర్కత్‌పురలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి అనేక వినూత్న పథకాలను అమలు చేస్తోందని దిడ్డి రాంబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఉచిత కుట్టు మిషన్ల పంపిణీతో పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, 'చేయూత' పింఛన్లు మరియు స్వయం ఉపాధి రుణాలు అందిస్తూ అండగా నిలుస్తోందన్నారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి మరియు అభివృద్ధికి ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి తగిన న్యాయం చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ సంక్షేమ పథకానికైనా దళారులు, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, నేరుగా సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలను సంప్రదించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు బి. మాణిక్ రావు, గడ్డం కృష్ణ, రఘు, రాము, జి. శ్రీనివాస్, ఆంజనేయులు, దాస్, ఎస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మధుసూదనాచారి జన్మదినం సందర్భంగా 'రెడీ టు సర్వ్ ఫౌండేషన్'లో సేవా కార్యక్రమాలు

**వృద్ధులకు అన్నదానం.. బెడ్‌షీట్లు, నిత్యావసర సరుకుల పంపిణీ**

**వనస్థలిపురం వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం**

ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 13:శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదినాన్ని పురస్కరించుకుని రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా





కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శివప్రకాష్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని ఓ వృద్ధాశ్రమంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేయడంతో పాటు బెడ్‌షీట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా సమాజంలో మానవత్వం, సేవాభావం మరింత పెంపొందుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివప్రకాష్ మాట్లాడుతూ.. సిరికొండ మధుసూదనాచారి మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆయన చేపట్టే ప్రయత్నాలన్నీ విజయవంతం కావాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకున్నారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు నవీన్, రాకేష్, వినయ్ కుమార్, రవి యాదవ్, సాయి యాదవ్, కళ్యాణ్, రాజ్, లక్కీ గౌడ్, శరత్, కౌశిక్, వంశీ, మజీద్, నవీన్ కుమార్, పవన్, నరేష్, ఆసిఫ్, ప్రవీణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమర్థవంతమైన అధికారులతోనే న్యాయం

**– సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు**

**– సమాచార హక్కు చట్టం అమలులో కలెక్టర్ అంకిత్‌కు అవార్డు రావడం అభినందనీయం**



భద్రాద్రి కొత్తగూడెం, మహా:సమర్థవంతమైన అధికారులతోనే అన్ని వర్గాల వారికి సంపూర్ణ న్యాయం జరుగుతుందని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరు కనబరిచి రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ కు పొన్నెకంటి సంజీవ రాజు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన సమాచార హక్కు వారోత్సవాలు?2026 కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా కలెక్టర్ అవార్డు స్వీకరించడం జిల్లాకు గర్వకారణం అన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత జవాబుదారీతనాన్ని పెంపొందించడంతో పాటు సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం చూపిన చొరవకు గుర్తింపుకు ఈ పురస్కారం అన్నారు. సమర్థవంతంగా పనిచేసే అధికారుల వల్లే సామాన్య ప్రజలకు న్యాయం జరిగే అవకాశాలు మెరుగుపడతాయని సమాచార హక్కు చట్టం స్ఫూర్తిని ఆచరణలో చూపిస్తూ ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ కు అందిన ఈ అవార్డు భవిష్యత్తులోనూ పారదర్శక పాలనకు ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత ప్రోత్సాహాన్నిస్తుందని పొన్నెకంటి సంజీవ రాజు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మన్సూరాబాద్ పెద్ద చెరువులో అపరిశుభ్రతపై తెలంగాణ రక్షణ సేన ఆగ్రహం.

**బతుకమ్మ పండుగ వేళా పారిశుద్ధ్యం ఏదీ?**

**మహిళలకు భద్రత ఏదీ**

**చెరువు నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం.. తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్**



మన్సూరాబాద్,జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 13 బతుకమ్మ పండుగ ప్రారంభమై నాలుగు రోజులు గడుస్తున్నా మన్సూరాబాద్ డివిజన్‌లోని పెద్ద చెరువులో కనీస పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంపై తెలంగాణ రక్షణ సేన నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువును పరిశీలించిన నాయకులు అక్కడ నెలకొన్న అపరిశుభ్రత, తగినంత నీరు లేకపోవడం, మహిళలకు భద్రత కొరవడటం, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ఆందోళన వ్యక్తం చేశారు. పండుగ వేళా పారిశుద్ధ్యం కరువు×బతుకమ్మ పండుగకు నాలుగు రోజులు గడుస్తున్నప్పటికీ చెరువు పరిసరాల్లో పూర్తిస్థాయి శుభ్రత పనులు చేపట్టలేదని నాయకులు పేర్కొన్నారు. చెరువులో నిమజ్జనం చేసిన బతుకమ్మలను తొలగించకపోవడంతో పాటు, నీటిని శుభ్రపరిచే చర్యలు కూడా కనిపించడం లేదని తెలిపారు. కొత్త నీటిని సరఫరా చేయకపోవడం, చెరువులో సరిపడా నీరు లేకపోవడం, బతుకమ్మలు నిమజ్జనం అయ్యేంత నీటి మట్టం లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ప్రతిరోజూ చెరువు పరిసరాలను శుభ్రం చేయడం వంటి కనీస చర్యలు కూడా చేపట్టడం లేదని ఆరోపించారు. ×అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి×చెరువు పరిసరాల్లో సిగరెట్లు, గంజాయి, బీరు, మద్యం సేవిస్తున్నట్లు తమ పరిశీలనలో గుర్తించామని నాయకులు ఆరోపించారు. దీంతో మహిళలు, చిన్నారులు, కుటుంబాలతో కలిసి చెరువు వద్దకు వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే ప్రజలకు కూడా తగిన భద్రత లేదని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రజల రద్దీ పెరిగినప్పటికీ సీసీ కెమెరాల ఏర్పాటు లేకపోవడం భద్రతాపరమైన లోపమని విమర్శించారు. ×సాయంత్రంలోగా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ హామీ×చెరువు వద్ద నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, ఈరోజు సాయంత్రం వరకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అధికారులు ఇచ్చిన హామీ మేరకు చర్యలు చేపడతారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉందన్నారు. ×ప్రజల భద్రత విషయంలో వెనకడుగు వేయం: రామ్ కోటి ప్రజాపతి×ప్రజల ఆరోగ్యం, భద్రత విషయంలో తెలంగాణ రక్షణ సేన ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని రామ్ కోటి ప్రజాపతి స్పష్టం చేశారు. బతుకమ్మ పండుగను ప్రశాంతంగా, పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించుకునేలా అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. చెరువులో నీటి శుభ్రత, తగినంత నీటి సరఫరా, బతుకమ్మల తొలగింపు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, నిరంతర పారిశుద్ధ్య పనులు, సీసీ కెమెరాల ఏర్పాటు, మహిళలకు మరియు వాకర్లకు భద్రత కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రక్షణ సేన నాయకులు శేఖర్, గిరి, లింగం, వెంకట్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

**- ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి**

**- వైకుంఠధామానికి ప్రత్యామ్నాయ రహదారి**

**- ప్రహరీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి**

**- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):గోదావరి పుష్కరాల ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులు పుష్కర ఘాట్ల నిర్మాణం భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ సంబంధిత శాఖల అధికారులు ఇంజినీర్లతో కలిసి వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి చేరుకున్న కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకోగా అర్చకులు





వేద ఆశీర్వచనం అందించారు. దర్శనానంతరం ఆలయ ఉత్తర ద్వారం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్ ఆలయ ఉత్తర దక్షిణ ప్రాంతాల్లో చేపట్టిన నిర్మాణాల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్లాబ్ నిర్మాణం రక్షణ గోడలు మట్టి నింపే పనులు తదితర నిర్మాణాలను పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆలయం నుంచి గోదావరి స్నాన ఘాట్లకు వెళ్లే రహదారిని పరిశీలించిన కలెక్టర్ భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రహదారిని విస్తరించాలని ఆదేశించారు. ప్రస్తుతం సుమారు 25 అడుగుల వెడల్పు ఉన్న రహదారిని మరో ఐదు అడుగులు విస్తరించి 30 అడుగులకు పెంచే ప్రతిపాదనపై చర్చించారు. రహదారికి ఇరువైపులా ఉన్న నిర్మాణాలు మెట్లు ఇతర అడ్డంకులను పరిశీలించి అవసరమైన చోట్ల మార్కింగ్ చేయాలని సూచించారు. భూమికి సంబంధించిన అంశాలు అనుమతులు నిధులు బిల్లుల పరిష్కారంలో రోడ్లు భవనాలు రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వైకుంఠధామానికి వెళ్లే మార్గాన్ని పరిశీలించిన కలెక్టర్ పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉన్న రహదారికి ప్రత్యామ్నాయంగా మరో మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టడంతో పాటు వైకుంఠధామం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. విద్యుత్ దహనవాటికతో పాటు ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతులు పొందడం టెండర్ ప్రక్రియను వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని తెలిపారు. పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ ఉత్తర వైపు సుమారు 270 మీటర్లు, దక్షిణ వైపు 230 మీటర్ల పొడవున చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఘాట్ల వద్ద మెట్లు ల్యాండింగ్ ప్రాంతాలు రక్షణ గోడలను పటిష్టంగా నిర్మించాలని పాత గోడలకు పగుళ్లు ఏర్పడిన చోట మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పర్ణశాల వద్ద టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తుల వసతి కోసం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో డార్మిటరీ హాల్ నిర్మిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గోశాల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని కూడా ఆయన సమీక్షించారు. భద్రాచలంతో పాటు చర్ల, అశ్వాపురం, దుమ్ముగూడెం, పర్ణశాల, కిన్నెరసాని పరిసర ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూపొందించిన ప్రతిపాదనలపై అధికారులతో చర్చించారు. అనంతరం సారపాక బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్ ఐటీసీ నుంచి భద్రాచలం బ్రిడ్జి వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి సుందరీకరణకు చేపట్టాల్సిన చర్యలపై ఐటీసీ ప్రతినిధులు సంబంధిత అధికారులతో చర్చించారు. రహదారి మధ్య విభాజకాలు, ఇరువైపులా పుష్పించే మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని బౌగెన్‌విల్లియా వంటి రంగురంగుల పూల మొక్కలతో సుందరీకరణ చేపట్టాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను వారం రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు. గత మార్చి నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన అనంతరం ఇరిగేషన్ దేవాదాయ రోడ్లు భవనాల శాఖల ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పుష్కరాల ఏర్పాట్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయ ఉత్తర దక్షిణ ప్రాంతాల్లో చేపట్టిన పనులను వేగవంతం చేసి ముక్కోటి ఏకాదశి శ్రీరామనవమి, గోదావరి పుష్కరాల గడువులోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం సుమారు 200 మంది కార్మికులతో పాటు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు లైటింగ్ సౌకర్యంతో పనులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గోదావరి పుష్కరాలకు సమయం తక్కువగా ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మార్చిలో జరిగే శ్రీరామనవమి ఉత్సవాలతో పాటు జూన్ 27 నుంచి జూలై 7 వరకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత దృష్ట్యా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు మరుగుదొడ్లు రవాణా పోలీసు భద్రత వైద్య సేవలు తదితర మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పించాలని తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలల నుంచే అవసరమైన ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా ప్రారంభించి పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈ ఈ నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, తహసిల్దార్ రవికుమార్, ఇన్చార్జి ఎంపీడీవో జిపిఈఓ శ్రీనివాస్, దేవస్థానం డిఈ రవీందర్రావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లింగోజిగూడలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**మంగ్లీ ఆటపాటలతో ఉర్రూతలూగిన మహిళలు**

ఎల్.బి.నగర్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 13: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో లింగోజిగూడ డివిజన్ పరిధిలోని జ్యోతి క్లబ్ వద్ద బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. ఈ వేడుకల్లో ప్రముఖ గాయని మంగ్లీ తన బృందంతో కలిసి ఆలపించిన పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆమె ఆటపాటలతో మహిళలు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల సంప్రదాయ పండుగైన బతుకమ్మను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటూ పండుగ శోభను మరింత పెంచారు. ఈ కార్యక్రమంలో జయచంద్రరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కమల సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ మహిళలు, మహిళా నాయకురాళ్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**